# జహాంగీరు

ఎం. ఎస్. మూర్తి

'శేషయ్యా ?'

"ప్రభూ ! ఏమిటలా-?"

"నా ఆశలన్నీ భగ్నమైనాయోయ్-"

"చిత్తం ! ఏం జరిగిందేమిటండి ?"

"మన జహాంగీర్ విషయం-"

"........?"

"అదేనోయ్-మనం కొత్తగా కొన్న పంచకల్యాణి-"

"చిత్తం చిత్తం! భలేపేరు పెట్టారండి—ఇంతకీ ఏం జరిగిందేమిటి ?"

"దీపావళినాడు తొలిసారి ఎక్కుదామని ముచ్చటపడ్డాను-"

"చిత్తం-ఇప్పుడేమండీ ? ఎక్కొచ్చును—ఈవేళగా దీపావళి ?"

"శేషయ్యా ? ఎలా ఎక్కమంటావోయ్ ? నా బాధలు నీకు అర్థమవుతాయా ?"

"ప్రభూ ! శాంతివహించండి. ఏం జరిగిందో చెబితే... ?"

"జహాంగీరు పరిస్థితి ఏమీ బాగా లేదోయ్-"

"జబ్బొండి ?"

"కాదు—"

"ఎక్కబోతే తంతున్నాడాండి?"

"ఊహు—"

"కరవొస్తున్నాడా ?"

"ఊహు—"

"మరేమిటండీ ?"

"దీనంగా చూస్తూ, కళ్ళవెంబడి అశ్రుధారలు కారుస్తూ ఇష్టం లేనట్టుగా, విరక్తిగా నిలబడి వుంటున్నాడు—"

"కాస్త హెచ్చరించి, బుజ్జగించలేకపోయారా?"

"నా శాయశక్తులా ప్రయత్నించాను, అశ్విక పరీక్షకుడు కూడా వచ్చి చూచి పెదవి విరిచాడు—శేషయ్యా" జహాంగీరు ఏదో మనోవేదనతో బాధపడుతున్నట్టున్నాడు—"

"విచారించవలసిన విషయమేనండి—ఐనా ప్రభూ ! కొంచెం ధైర్యం వహించండి—గుర్రాలకు ఇలాంటి టిక్క—"

"తిక్కకాదు-మనోవ్యాధి అను—"

"చిత్తం , మనోవ్యాధే అనండి-అది ఎలా వొచ్చిందో అలాగే పోతుందండి-'

"ఇంతకీ ఈ దీపావళి ఘడియలలో నేను నా జహాంగీరుపైన స్వారిచేసే అదృష్టం—"

"ప్రభూ! అధైర్యపడకండి-ఇంతకూ ఒక్క మనవి-జహాంగీరు తన శాలలో ఒక్కడే వుంటున్నాడా?"

"అవును—ఒక్కడే"

"ప్రభూ !"

"శేషయ్యా !

"గొప్ప పొరబాటు చేశారు—"

"ఏమిటది—ఏమిటోయ్ శేషయ్యా ?"

"శుద్ధచవట పెద్దమ్మ పనిచేశారు—"

"నా మొహం ! వెర్రివెధవని ! ఏం చేశానో చెప్పు—"

"ప్రభూ పశ్చాత్తాపానికి వ్యవధిలేదు"

"మరి ఏం చెయ్యమంటావ్ ?"

"ఈ దీపావళి ఘడియలు దాటిపోకుండా మా కోరిక సిద్ధించాల్నంటే-"

"ఈవేళ సాయంత్రానికేనా నేను నా జహాంగీరు నెక్కి షికారు చెయ్యాల్నంటే—"

"ఒక్కటే మార్గం—"

"ఏమిటదీ—త్వరగా ?"

"తమరు వెంటనే ఒక సూర్జహానును వెతికితెచ్చి జహాంగీరుకు కానుక పెట్టాలి—"



# జానకమ్మ - జామిచెట్టు

మునిగొండ శివప్రసాద్

'ఒరేయ్! మీ కేం పొయ్యే కాలం వచ్చిందిరా రాళ్ళు విసురుతారు' అని రెండు మూడు పరుషవాక్యాలూ, అమంగళాలూకూడా జోడించిన అరుపులు సర్వకాల సర్వావస్థలలోనూ వినబడే ఇల్లే జానకమ్మగారిది. పోరగాళ్ళు చెట్టుకు కాయలువున్నా లేకున్నా రాళ్ళువేయడం మటుకు అన్ని కాలాలలోనూ మానరు. ఓపిక ఉన్నా లేకున్నా ఊపిరి కూడ దీసుకొని జానకమ్మ రోడ్డుమీదపోతూ మనుషుల్ని అవాచ్యాలాడటం అన్ని ఋతువులలోనూ మానదు. కొంతకాలమయ్యేసరికి జానకమ్మకు ఈ తిట్లు దైనందిన కార్యక్రమంకింద, ఒక వదల లేని వ్యసనంకింద, ఒక క్రానిక్ డిసీజ్ కిందికి మారింది. అందువల్లనే చెట్టుపై ఎవరూ వేయకపోయినాసరే ముందు జాగ్రత్తగా అన్నట్లు 'ఒరేయ్ మీకేం పోయేకాలం— అని జానకమ్మ తిడుతూనే వుండే దశ ఒకటి ప్రాప్తించింది.

జానకమ్మ భర పరిగి గోవింద స్వామి జీవించివున్న రోజుల్లో మంచి ధనవంతుడనే నలుగురూ అంటారు కాని